క్లుప్తంగా

పదవితో మరింత బాధ్యత పెరిగింది


రాచూరి బాలస్వామి

పెదవేగి : తమపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవితో మరింత బాధ్యత పెరిగిందని వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజక వర్గ ఉద్యోగులు, పెన్షనర్ల అధ్యక్షుడు రాచూరి బాలస్వామి అన్నారు. పెదవేగి మండలం ముండూరు గ్రామ సర్పంచ్ రాచూరి దేవి బాలస్వామికి ప్రియతమ మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. తన మీద నమ్మకంతో దెందులూరు నియోజకవర్గ ఉద్యోగులు పెన్షనర్స్ విభాగానికి అధ్యక్షుడిగా నియమించినందుకు నమ్మకంతో పనిచేస్తానన్నారు.

భారీ అన్నసమారాధన


బువ్వనపల్లి ఆంజనేయ ఆలయంవద్ద అన్నసమారాధన

నిడమర్రు: నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు ఐదువేల మంది భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. మూడు రోజులపాటు ఆలయంవద్ద స్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి స్వామివారికి లక్ష అప్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సంకు త్రినాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ జానంపేట సబ్ స్టేషన్ పరిధిలోఉన్న జానంపేట, జగన్నాథపురం, సింగవరం, ముత్తనవేడు, గ్రామాలకు మరమ్మతుల నిమిత్తం ఈనెల 30 శుక్రవారం, 31 శనివారం ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదలచేయబడును. కావున వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఎగ్జిక్యూటివ్ ఆపరేషన్ ఏలూరు కెఎం అంబేడ్కర్ కోరారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైతుబజార్లలో ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే కాయగూరలు విక్రయించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యాపారులకు సూచించారు. స్థానిక పత్తేబాదలోని రైతుబజార్‌ను బుధవారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కాయగూరల ధరలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబజార్లలో వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో వినియోగదారులకు సేవలందించాలని వ్యాపారులకు సూచించారు. తాజా కాయగూరలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయించకుండా ఎస్టేట్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుబజార్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతుబజార్లలో పరిశుభ్రత పాటించాలని, టాయిలెట్లు కూడా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరమ్మత్తులకు గురైన పత్తేబాద రైతు బజార్లోని టాయిలెట్‌ను వెంటనే పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజారులో కలెక్టర్ స్వయంగా కాయగూరలు కొని, వాటి ధరలు రైతులకు చెల్లించారు. కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖాధికారులు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి, పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ఏలూరు టౌన్: బిడ్డలు రోగాలబారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు నిర్ణీత సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. బుధవారం ఏలూరులోని జ్వాలాపహరేశ్వర స్వామి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్షయ, పోలియో, రోటా వైరస్, కోరింత దగ్గు, రుబెల్లా, న్యుమోనియా లాంటి వాటికి ఉచితంగా వేస్తామని తెలిపారు. యూపీహెచ్‌సీ జేపీ కాలనీ వైద్యాధికారి డాక్టర్ నీలిమ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

వాడపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసు

జంగారెడ్డిగూడెం: వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ప్రతి శనివారం ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. లక్కవరం, ఎ.కొత్తపల్లి, దూబచర్ల, నల్లజర్ల పరిసర గ్రామాల నుంచి వాడపల్లి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 31 నుంచి జంగారెడ్డిగూడెంలో ఉదయం 04.30 గంటలకు, తిరిగి వాడపల్లిలో మధ్యాహ్నం 13.00కి బయలుదేరి జంగారెడ్డిగూడెం వస్తుందని తెలిపారు.

బోసిపోతున్న సచివాలయాలు

కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



దెందులూరులోని సచివాలయం

దెందులూరు: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేలు అందేలా కృషి చేశారు. ప్రతి సచివాలయానికి 15మంది వివిధ అంశాలను సంబంధించి ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కింది. పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిన దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారు. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఇంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ ఊదరగొట్టారు కూటమి నాయకులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా సచివాలయ వ్యవస్థను పక్కన బెట్టి, ప్రజల సేవలకు కొత్త పెట్టారు. నాడు కళకళలాడిన సచివాలయాలు నేడు సేవలు అందక బోసిపోయాయి. అధికారంలోకి వచ్చి ఏడాది పూరైనా సచివాలయంలో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గత ప్రభుత్వానికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తూ వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తూ సచివాలయాల్లో సిబ్బందిని లేకుండా చేస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు 600మంది ఉద్యోగులు

దెందులూరు నియోజకవర్గంలో 75గ్రామ సచివాలయాలు ఉన్నాయి. దెందులూరులో 20, పెదపాడులో 22, పెదవేగిలో 28 ఏలూరు రూరల్ 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 600మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో పరిపాలన, విద్యా, సంక్షేమం, ప్లానింగ్, నీటి సరఫరా, మహిళా పోలీస్, పారిశుద్ధ్యం, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం తదితర విభాగాలతో గ్రామ పరిపాలనా విభాగం పనిచేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. 2014-19 పరిపాలనలో పడిన అవస్థలను ప్రజలకు మళ్లీ పరిచయం చేస్తున్నారు. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు దాపురించాయి. సచివాలయ వ్యవస్థను పట్టించుకోకుండా అందులో పనిచేస్తున్న సిబ్బందిని వివిధ రకాలైన రిసర్వేలు పింఛన్ల పంపిణీకి ఉపయోగించడంతో సచివాలయాలు బోసిపోతున్నాయి. రేషన్‌కార్డుల్లో పేర్ల మార్పు, తీసివేయడం, పొలం వన్‌బీ, అడంగల్, పొలాన్ని ఆన్‌లైన్ చేయడం, ఇతర ప్రధాన సేవల కోసం రెవెన్యూ కార్యాలయ చుట్టూ రోజుల తరబడి తిరిగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో?

భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అయినా పరిష్కారం కావడం లేదు. గతంలో సచివాలయాల్లో వీఆర్‌ఓ గ్రామంలో అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీఆర్‌ఓ మండల కేంద్రంలో కూర్చుంటున్నారు. అడంగల్, వన్ బీ, పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వస్తోంది. సచివాలయంలో పలకరించే నాథుడు లేకుండా పోయారు. ప్రజలు సచివాలయాల దగ్గరకు చెప్పులు అరిగేలా తిరుగుతున్న పనులు కావడం లేదు. ఫలానా అధికారి కోసం వస్తే ఆ అధికారి సర్వేకు వెళ్లాడని ఇతర అధికారులు చెబుతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గతంలో ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా గ్రామస్థాయిలోనే పనులు పూర్తయ్యేవి. ప్రస్తుతం సచివాలయంలో పనులు జరగడం లేదు. ఏ పని జరగాలన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామం మండల కేంద్రానికి 10కిలో మీటర్ల దూరంలో ఉంది. ఒక పనిమీద మండల కేంద్రానికి వెళ్లాలంటే ఆరోజు మొత్తం ఆ పని కోసమే కేటాయించాలి. పని జరగక పోతే మళ్లీ మరుసటి రోజు రావాలి. గత ప్రభుత్వం గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరించి గ్రామ స్వరాజ్యాన్ని చూపించింది. ఇప్పుడేమో వలంటీర్ వ్యవస్థను లేకుండా చేసే సచివాలయ సిబ్బందిని ఇతర పనులకు వాడుకుంటున్నారు. బాధితులు ఏదైనా పనుల నిమిత్తం వస్తే కనీసం పలికేవారు లేకుండా పోయారు. గతంలో ఏదైనా పని ఉంటే వలంటీర్‌కు చెబితే చాలు. అన్నీ వారే చూసుకొని పని చేసి పెట్టే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– అంగడాల సీతారావమ్మ, వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు

అధికారుల యోగాసనాలు


యోగా చేస్తున్న ఉద్యోగులు

దెందులూరు: నియోజకవర్గంలోని అధికారులు బుధవారం యోగా సాధన చేశారు. దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సచివాలయ సిబ్బందికి బుధవారం యోగ శిక్షణ తరగతులు జరిగాయి. ట్రైనర్ సీహెచ్ అంజలి ప్రభాకర్ రావు ఉద్యోగులకు యోగాసనాలు వివరించి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక శారీరక ప్రశాంతత దృఢత్వం లభిస్తుందన్నారు. వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కొంత సమయం విధిగా కేటాయించాలన్నారు.

దోసపాడులో పల్లెనిద్ర


దోసపాడులో పల్లె నిద్ర చేస్తున్న సీఐ, ఎస్ఐ

దెందులూరు: ప్రతి ఒక్కరితో మానవ సంబంధాలు కలిగి ఉండటంతో పాటు ప్రజల రక్షణ లక్ష్యంగా పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం దోసపాడులో దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ సిబ్బందితో కలిసి పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు పల్లెనిద్ర చేశారు.

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యంతో పెదవేగి మండలం కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమిలి భాస్కరరావు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. భాస్కరరావు ఆత్మ హత్యతో అతని కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. భాస్కరరావు తన ఇంటి నిర్మాణానికి మహే ంద్ర ఫైనాన్స్ కంపెనీ నుంచి తీసుకున్న అప్పు చెల్లించడంలో ఆలస్యం అవ్వడంతో రికవరీ ఏజెంట్లు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి ఆత్మహత్యకు పాల్పడే విధంగా దోహదం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, సంబంధిత కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కరరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రజలను ఇబ్బందులు పాలు చేసే ఇలాంటి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వారి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కూటమి పాలనలో అటకెక్కిన పథకాలు



వెలవెలబోతున్న ఉంగుటూరు సచివాలయం

ఉంగుటూరు: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. ఇంటింటికీ రేషన్ అందజేశారు. అవినీతి, వివక్షతకు తావులేకుండా పాలన సాగించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలను రైతులకు అందజేశారు. ఈ సేవలకు నేటి కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. ఒక్కొక్కటిగా సేవలను నిలపుదల చేస్తోంది. వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యం చేసింది. రేషన్ పంపిణీని షాపులకే పరిమితం చేస్తున్నారు. ఆర్‌బీకేల్లో కియోస్క్ సేవలు నిలిపేసింది. కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో తీవ్ర నిర్లక్ష్యం అవలంబిస్తోంది.

పథకాలను అమలు చేయాలి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇచ్చిన ప్రతి హామీని ఏడాదిలోపే అమలు చేశారు. సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ ఐదేళ్లపాటు అందేలా కృషి చేశారు. 2024 ఎన్నికల్లో కూటమి నాయకులు అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చారు. వాటిని అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నెరవేర్చకపోగా, ప్రజలకు ఉపయోగపడే పథకాలను రద్దు చేస్తున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలే. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అమలు చేయాలి.

– చవ్వాకుల రామపండు, తాపీమేస్త్రి, చేబ్రోలు

సిబ్బందిని కుదించే కుట్ర



వైఎస్సార్ సీపీ హయాంలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. సచివాలయాల్లోని సిబ్బంది కుదించే కుట్ర చేస్తోంది. విత్తు నుంచి విక్రయం ద్వారా వ్యవసాయంతో అవసరమయ్యే ప్రతి సేవను వైఎస్సార్ సీపీ హయాంలో ఆర్‌బీకేల ద్వారా అందజేశారు. నేడు ఆ సేవలు సరిగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– బేతపూడి సుబ్బారావు, నాచుగుంట

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ సేవలు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉంటూ, సచివాలయ సిబ్బంది ఇంటికే సంక్షేమ పథకాలు అందించేవారు. కూటమి ప్రభుత్వంలో సచివాలయ సేవలు ప్రజలకు అందుబాటులో లేవు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కుట్ర చేస్తున్నారు.

– చింతల కిషోర్, కాగుపాడు

ప్రతి ఒక్కరికీ యోగా అత్యవసరం


భీమడోలులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, చిత్రంలో సత్యేంద్ర, జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్‌లు


నిడమర్రులో యోగా చేస్తున్న అభ్యాసకులు

భీమడోలు: నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా అత్యవసరమని మండల ట్రైనర్ పోలిశెట్టి సత్యనారాయణ(సత్యేంద్ర) అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 26వ రోజుకు చేరుకున్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు విద్యార్థులు నీతి కథలు తెలిపారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని నీతి కథలు, గణితంలో మెలకువలను నేర్చారు. సామూహిక పుస్తక పఠనం చేశారు. పుస్తక సమీక్షలు రాసారు. తొలుత విద్యార్థులకు మండల ట్రైనర్ సత్యనారాయణ చిన్నారులచే యోగాసనాలు వేయించారు. సూర్య నమస్కారాలను వల్ల ప్రయోజనాలను వివరించారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వ తేదీన వైజాగ్‌లో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆరోగ్యమే పరమావధిగా ఈ కార్యక్రమాన్ని చేస్తుందన్నారు. యోగాసనాల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. అనంతరం చిన్నారులు ఆటలు ఆడారు. ఈ కార్యక్రమాల్లో గ్రంధపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి,రిసోర్స్‌పర్సన్ ఈతకోట భవ్యశ్రీ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


నీలాద్రిపురం యోగా ర్యాలీ జరుపుతున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నిడమర్రు: యోగాతో ప్రశాంతత లభిస్తుందని నిడమర్రు ఎంపీడీవో విజయకమారి తెలిపారు. బుధవారం ఎంపీడీవో సమావేశపు హాల్‌లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా క్లాసు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ నిరంతర యోగా చేస్తే ఎన్నో ఆరోగ్యపరమైన ఫలితాలు పొందవచ్చునని పేర్కొన్నారు. ఆయుర్వేద డా. జిజియా బాయ్ మాట్లాడుతూ యోగా కార్యక్రమం ప్రభుత్వం మాసోత్సవం క్రింద నిర్వహించడం జరుగుతోందని వివరించారు. యోగా మాస్టర్ ట్రైనర్ పి వి పెద్దిరాజు అభ్యాసకులు చేత యోగాసనాలు వేయించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఆయాలు సుమారు 30 మంది పాల్గొని యాగాసనాలు వేశారు. కొంత మింది చిన్నారులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీలాద్రిపురంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. యోగా మాస్టర్ ట్రైనర్ రంగు స్వరూపరాణి, మహిళా పోలీసు ఆధ్వర్యంలో ఆశనాలు వేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిపిన కార్యక్రమంలో సర్పంచ్ చదలవాడ రాజేంద్రకుమార్, పంచాయతీ సెక్రటరీ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు పంచాయితీ కమ్యునిటి హాలులో యోగాసనాలు వేయించారు. పలు గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగుల పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్ మంద జయలక్ష్మి అభ్యాసకులుచేత యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోజు, డా. శంకర్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలి


రుతుక్రమంపై గణపవరం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ప్రదర్శన


పరిశుభ్రతపై పిప్పర పీహెచ్‌సీ సిబ్బంది ప్రదర్శన

గణపవరం: మహిళలు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్య పరమైన సమస్యలకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. బుధవారం జాతీయ రుతుక్రమదినోత్సవం సందర్భంగా గణపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది సంవత్సరాల వయస్సులో రుతుక్రమం ప్రారంభమై 50 సంవత్సరాల వయస్సు వరకూ కొనసాగుతుందని, ఈ సమయంలో ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని సూచించారు. పాఠశాలల్లో చదివే విద్యార్థినులు తప్పనిసరిగా ప్రభుత్వం సరఫరా చేసే శానిటరీ నాప్‌కిన్స్ వాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఓంకార్‌నాథ్, సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్‌ఎన్ వి సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిప్పర పీహెచ్‌సీలో: రుతుక్రమ సమస్యలపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సి వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. బుధవారం జాతీయ రుతుక్రమదినోత్సవం సందర్భంగా మహిళలకు ఆరోగ్యసమస్యలు, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో మహిళలు మానసికంగాను, శారీరకంగాను ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారని, వీటిని అధిగమించడానికి మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, మిడ్‌లెవల్ ఆరోగ్యసిబ్బంది మహిళలకు రుతుక్రమ సమస్యలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నిడమర్రు మండల మానవత నూతన కమిటీ సభ్యులు

నిడమర్రు: ఎంత సంపాదించినా లభించని మానసిక సంతృప్తి సమాజంలో ఇతరులకు సహాయపడటంలోనే లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని మానవత సంస్థ జిల్లా సమన్వయకర్త సాగిరాజు జానకిరామరాజు అన్నారు. బుధవారం రాత్రి నిడమర్రు మండల మానవత సంస్థ నూతన కార్యవర్గ ఎన్నికలు నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో జరిగాయి. ఈసందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జానకిరామరాజు మాట్లాడుతూ మానవసేవ చేయడమంటే మాధవసేవ చేయడమేనని, ఇదే మానవత సంస్థ సిద్ధాంతమని ఆయన అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించే సంస్థలకు దాతల సహకారం ఉంటే మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలోనూ కనీసం 200 మంది సభ్యులను చేర్పడమే మానవత లక్ష్యం అన్నారు. మానవత సంస్థ ద్వారా ప్రతి గ్రామంలోనూ ఒక ఫ్రీజర్, ప్రతి మండలంలోనూ ఒక శాంతిరథం ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. ఈదిశగా ఇప్పటికే 90శాతం లక్ష్యం నెరవేరిందన్నారు. మానవత జిల్లా నాయకులు వెల్లంకి నరేష్, సంకు సత్యకుమార్, కిలారి రవిబాబు, సంకు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఈసందర్భంగా మండల నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల మానవత అధ్యక్షుడిగా వన్నెంరెడ్డి పరమేశ్, ఉపాధ్యక్షుడిగా నిమ్మల సాంభమూర్తి, కార్యదర్శిగా అలుమోలు అంతర్వేది, కోశాధికారిగా సంకు శ్రీనివాసరావు(కాన్వెంట్ శ్రీను) ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వీరిచేత జానకిరామరాజు పదవీప్రమాణం చేయించారు. అనంతరం మానవత సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని, గ్రామస్థాయిలో సభ్యత్వ నమోదు పెంచడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేశ్ ఆర్థికసహాయం రూ.60 వేలతో ఏర్పాటు చేసిన ఫ్రీజర్‌ను జానకిరామరాజు తదితరులు ప్రారంభించారు.

పకడ్బందీగా రేషన్ పంపిణీ


రేషన్‌షాపులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: కార్డుదారులకు నిత్యావసర సరుకులను పకడ్బందీగా పంపిణీ చేయాలని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. మండలంలో 41 రేషన్ షాపులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను వివరించారు. జూన్ నెలలకు సంబంధించి రేషన్ డబ్బు డీలర్లు అందరూ వారివారి షాపుల్లో చెల్లించాలన్నారు. రేషన్ షాపుల్లో ప్రైస్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. రేషన్ షాపులు ఎంత ఖచ్చితమైన తూకం ఇవ్వడానికి ఈపాస్ వేయింగ్ మిషన్ పనిచేసే విధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. పనిచేయని ఈ-పాస్ వేయింగ్ మిషన్ల వివరాలు ఎప్పటికప్పుడు పై అధికారులకు వివరించాలని తెలిపారు. కంట్రోల్ నెంబర్లను డీలర్ల షాపుల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచాలి. షాపుల వద్ద ఈ-పాస్ ఇబ్బందులు లేకుండా పనిచేయటం ఫైబర్ నెట్ షాపుల్లో ఉంచుకోవాలని, షాపుల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రేషన్ షాపులు వారి పాయింట్ వద్ద తప్ప బయట స్టాక్ పాయింట్ వద్ద పెట్టరాదన్నారు. వృద్ధులకు 65 సంవత్సరాలు పైబడిన వారికి వికలాంగులకు ఇంటికి వెళ్లి రేషన్ డీలర్ సరుకులను అందజేయాలన్నారు. అటువంటి వారి డేటాను డీలర్లు అందరూ ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల పరిధిలో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని సంబంధిత సమాచారం గ్రామస్తులకు తెలియజేయాలన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

టి.నరసాపురం: ఏఎస్ఆర్ నగర్ నివాసులకు విద్యుత్, నీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. సీపీఎం టి.నరసాపురం మండల కమిటీ సమావేశం పరగడ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రవి మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్ ఏర్పడి 17 సంవత్సరాలయ్యిందని, నేటికి అక్కడ విద్యుత్, మంచినీటి సౌకర్యం లేదని తెలిపారు. హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అక్కడ మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ మండల కార్యదర్శి మడకం సుధారాణి, సభ్యులు గుడెల్లి వెంకట్రావు, మడకం కుమారి, మొండ్రు శిరీష, బరగడ కుమారి, అనుమోలు మురళి తదితరులు పాల్గొన్నారు.